క్లుప్తంగా

చంద్రమౌళికి డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ అధ్యాపకుడు డి.చంద్రమౌళికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్‌సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ పరిశోధనా పర్యవేక్షకుడు డాక్టర్ టి.చంద్రశేఖర్ రావు పర్యవేక్షణలో 'బిహేవియర్ ఆఫ్ గ్రాడెడ్ ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ సెల్ఫ్– కాంపాక్టింగ్ కాంక్రీట్ ఎలిమెంట్స్ ఇన్ షేర్ అండ్ ఫ్లెక్చురల్ లోడింగ్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినట్లు వివరించారు.

పండిట్ దీన్ దయాళ్ వర్ధంతి

గుంటూరు మెడికల్: స్థానిక సంగడిగుంటలో ఆదివారం పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి బీజేపీ నేతలు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఏడో మండల అధ్యక్షుడు తిరువళ్లూరి వెంకటరమణ, రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్, రాష్ట్ర మీడియా కో కన్వీనర్ వెలగలేటి గంగాధర్, కోరంగి నాగమల్లేశ్వరి, కోరంగి నాగ మనోహర్, తోట శివపార్వతి, శ్రీను, మొవ్వ సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు



పాత గుంటూరు: స్థానిక బ్రాడీపేట శ్రీ సిద్దేశ్వర పీఠ పాలిత ఓంకార క్షేత్రంలో శ్రీ సరస్వతి సంగీత విద్వత్ సభ ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజ స్వామి 177వ ఆరాధనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఎనిమిది నుంచి 12 గంటల పాటు లఘు, అఖండం పేరుతో ఘన రాగ పంచరత్నకృతుల గోష్ఠి గానం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాఢభూషి వేదాంత నరసింహాచార్యుల వారి శిష్యులతోపాటు అనేక మంది కళాకారులు శ్రీ త్యాగరాజ స్వామి కీర్తనలను ఆరాధనతో ఆలపించి శ్రీ త్యాగరాజ స్వామి వారికి నీరాజనాలు అర్పించారు. వయోలిన్‌పై ధూళిపాళ్ల శ్రీనివాస్, పెరవలి లక్ష్మీ జయంతి, పెరవలి నందకుమార్, మృదంగంపై మోదుకూరి నగధరరావు, చావలి కృష్ణమోహన్, కే సురేష్‌కుమార్ సహకారం అందించారు.

ప్రజా ఆరోగ్యానికి హెల్త్ హబ్ ప్రారంభం



నగరంపాలెం: హెల్త్ హబ్‌ల ఆవశ్యకత చాలా ముఖ్యమని వి.వి.వి.హెల్త్ హబ్ అధినేత టి.అరుణ్‌కుమార్ అన్నారు. జేకేసీ కళాశాల రోడ్‌లో ఏర్పాటు చేసిన వి.వి.వి.హెల్త్ హబ్‌ను ఆదివారం ప్రారంభించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో రద్దీ వాతావరణంలో ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించడంతో, దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారని ఆయన అన్నారు. ఇటువంటి క్రమంలో ఆరోగ్య హబ్‌లు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో యోగా గురువులు టి.హరికృష్ణసాయి, డీఈ కేవీఎల్‌మూర్తి, ఎస్ఆర్ రెడ్డి, ఎస్‌డీ కుమార్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

నగరంపాలెం: సమాజంలో ఆదరణ కోల్పోయిన వారికి సాయం అందించడాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. నెలా నెలలో భాగంగా ఆదివారం కొత్తపేటలోని సమితి కార్యాలయంలో వంద మంది వయోవృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, 11 రకాల నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌వీ రమణ, పి.వెంకటసుబ్రహ్మణ్యం, పి.లహరి, పలకలూరి శివరావు, టి.మురళీసాయి, ఎస్.పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి

లక్ష్మీపురం: తెలుగు సినీ గీతాన్ని, సంగీతాన్ని సుసంపన్నం చేసిన మహా గాయకుడు ఘంటసాల అని ఆయన స్వరం తెలుగు వారికి ఒక వరమని సినీరంగ విశ్లేషకులు ఎ.అమరాచారి, అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఘంటసాల వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నలుగురి అరెస్టు

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తిపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. ఈ నెల 9వ తేదీ ఇటుకల పాటి నాగరాజుపై పలువురు దాడి చేసి గాయపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు తాడిశెట్టి లక్ష్మీనారాయణ, దుర్గారావు, శివమణికృష్ణ, సాయికిషోర్‌లను ఆదివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నాం

- పార్కులు పూర్తి స్థాయిలో అభివృద్ధి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- శ్రీనివాసరావుపేటలో రాఘవయ్య పార్కు ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని, మేయర్ కావటి మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: గుంటూరు నగరాన్ని సుందరంగా పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త విడదల రజిని తెలిపారు. శ్రీనివాసరావుపేటలో రూ.37 లక్షలతో అభివృద్ధి చేసిన రాఘవయ్య పార్కును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరులోని అన్ని పార్కులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఐదేళ్లలో అన్ని రంగాల్లో గుంటూరును అగ్రగామిగా చేయడం లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. నగరంలో గాంధీ పార్కును అభివృద్ధి చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతోందన్నారు. ఆహ్లాదాన్ని పంచడంతో పాటు వ్యాయామానికి ఉపయోగపడేలా అన్ని పార్కులను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా తమ మన పాలన సాగుతోందని చెప్పారు. గుంటూరులోని కీలక ప్రాంతాలన్నింటిలో పార్కులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పార్కుల అభివృద్ధితోపాటు నగరంలో అవసరమైన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా నగరంలోని అన్ని వార్డులను మోడల్ వార్డులుగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు గేదెల నాగరంగమణి, నిమ్మల వెంకటరమణ పాల్గొన్నారు.

దేవుడి ఆశీస్సులు జగనన్నకే

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి రజిని

పట్నంబజారు: రాష్ట్రంలో ఆలయాలకు మహర్దశ కల్పించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు శ్యామలానగర్ మూడో లైనులోని సంతోషిమాత ఆలయంలో ఆదివారం ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు, ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి రజిని మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆలయాల్లో అర్చకులకు గౌరవ వేతనం అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతోందన్నారు. కరోనా కల్లోల సమయంలో రూ.5 వేలు అర్చకులకు అందజేసి, వారికి అండగా నిలంబడ్డారన్నారు. వంశపారపర్య అర్చకత్వం చేసుకునేందుకు జీఓ జారీ చేసి వారి కుటుంబాల్లో సంతోషాలు నింపారన్నారు. భగవంతుడు అంటే ఎంతో నమ్మకం ఉన్న సీఎం వైఎస్ జగన్, అర్చకులకు ఎంతో అండగా నిలబడటంతో పాటు, ఆలయాలకు శోభ తీసుకునివచ్చే విధంగా ధూపదీప నైవేద్యాలను అందజేశారన్నారు. ఆ దేవుడి ఆశీస్సులు జగనన్నకు నిండుగా ఉన్నాయని పేర్కొన్నారు. సంతోషిమాత ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ తిరిగి అధికారంలోకి వస్తుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ వడ్లమాను రవి, ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు ఉడుముల శ్రీనివాసరెడ్డి, భవనం వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా క్రెడాయ్ నూతన భవన ప్రారంభం



క్రెడాయ్ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

పాత గుంటూరు: గుంటూరు మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శిల్పారామం వెనుక బాలాజీనగర్‌లో క్రెడాయ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో క్రెడాయ్ గుంటూరు చాప్టర్ నూతన భవనం ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రెడాయ్ కార్యాలయానికి విరాళంగా స్థలం, భవనాన్ని నిర్మాణం చేయడంతో ఆళ్ళ శివారెడ్డి భవన్‌గా క్రెడాయ్ గుంటూరు చాప్టర్ నామకరణం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ దినదినాభివృద్ధి చెందుతున్న క్రెడాయ్ గుంటూరు చాప్టర్‌కు స్థలాన్ని ఇచ్చి దానిలో భవనాన్ని నిర్మించి ఇవ్వడం మా కుటుంబ సభ్యులందరికి ఎంతో సంతోషంగా ఉందన్నారు. క్రెడాయ్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. క్రెడాయ్ నేషనల్ మాజీ ప్రెసిడెంట్, సీఐఐ, తెలంగాణ చైర్మన్ సి.శేఖర్ రెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ గుంటూరు చాప్టర్ వారు అధునాతన పద్ధతిలో సొంత భవనాన్ని నిర్మించుకోవడానికి తోడ్పాటునందించిన ఆళ్ల శివారెడ్డి దంపతులను అభినందించారు. క్రెడాయ్ జాతీయ సెక్రెటరీ జి.రామిరెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్‌ను ప్రగతి పథంలో నడిపిస్తున్న శివారెడ్డిని అభినందించారు. క్రెడాయ్ జాతీయ జాయింట్ సెక్రెటరీ బి.రాజా శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ వైవీ రమణ రావు, జనరల్ సెక్రెటరీ బి.శ్రీనివాసరావు, గుంటూరు చాప్టర్ చైర్మన్ ఆరుమళ్ల సతీష్‌రెడ్డి, ప్రెసిడెంట్ మామిడి రాము, సెక్రెటరీ తియ్యగూర వినోద్ రెడ్డి, ట్రెజరర్ మద్ది నాగ వెంకట కార్తీక్, మెట్టు సాంబశివారెడ్డి, సురేష్, జాయింట్ సెక్రటరీ ఆళ్ళ నాగార్జున రెడ్డి, ఇ.సి. మెంబర్స్ తదితరులు ఆళ్ళ శివారెడ్డి దంపతులను సత్కరించారు.

సెల్‌ఫోన్‌లు అప్పగించిన జీఆర్పీ పోలీసులు



సెల్‌ఫోన్‌లను అప్పగిస్తున్న జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు

లక్ష్మీపురం: రైళ్లలో ప్రయాణించే సమయంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సంబంధిత ప్రయాణికులను గుర్తించి అందించినట్లు జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం సెల్‌ఫోన్‌లు పోగొట్టుకుని ఫిర్యాదు చేసిన పది మందికి ఫోన్లు అప్పగించారు. ఆయన మాట్లాడుతూ రైలులో ప్రయాణించే సయమంలో ప్రయాణికులు నిద్ర మత్తులో ఉండటం, స్టేషన్ వచ్చిన సమయంలో హడావుడిగా దిగడం వంటి పలు సందర్భాలలో సెల్‌ఫోన్‌లు, బ్యాగ్‌లను మరచి పోతుంటారని తెలిపారు. అటువంటి సమయంలో సంబంధిత రైల్వే స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం వలవ ప్రయాణికులకు సెల్‌ఫోన్‌లను తమ విజయవాడ ఐటీ కోర్ సహకారంతో సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అందజేసే విధంగా రైల్వే ఎస్పీ ప్రత్యేక ప్రయాణికులను రూపొందించారు. రైలులో ప్రయాణికులకు అన్ని విధాల సదుపాయాలు కల్పించడంతో పాటు వారి భద్రత కూడా తాము బాధ్యతగా వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం పది మంది ప్రయాణికులకు సెల్‌ఫోన్‌లను అందజేయడంతో ప్రయాణికులు జీఆర్పీ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు డివిజన్ జీఆర్పీ ఎస్ఐలు జి.వెంకటాద్రి, పి.రమేష్ పాల్గొన్నారు.

పశు ఉత్పాదకతకు ప్రాముఖ్యం ఇవ్వాలి

ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు



పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుంటూరు రూరల్: పశువుల ఉత్పాదకతకు రైతులు ప్రాముఖ్యత నివ్వాలని ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ మన దేశం వ్యవసాయక దేశమని మొదటి నుంచి రైతులు పంటల సాగుతో పాటు పాడి పశువులను కూడా పోషిస్తూ పశు వ్యర్థాలను పంటల సాగుకు, పంటల వ్యర్థాలను పశువులకు అందిస్తూ జీవితాలను కొనసాగించారన్నారు. కాలం గడిచేకొద్దీ వివిధ రకాల కారణాల వలన వ్యవసాయం పశుపోషణ విడిపోవడం జరిగిందన్నారు. ఒకప్పుడు ఇంటి అవసరాలకు మొదలైన పశుపోషణ అనేక రకాలుగా మార్పు చెందుతూ ప్రస్తుతం పశుపోషణ వాణిజ్య పరంగా మారిందన్నారు. అధిక పాల దిగుబడుల కోసం మంచి పాడి పశువులను అభివృద్ధి చేయడం వలన వాణిజ్య సరళిలో పశు పోషణ చేపట్టే రైతులు ఎక్కువ మొత్తంలో పాడి పశువులను అధిక ధరలు పెట్టి కొనుగోలు చేస్తూ అధిక పాల దిగుబడి పొందుతూ స్వయం ఉపాధి మార్గంగా ఎంచుకుంటున్నారన్నారు. పాడి రైతులు ఆర్థికంగా లాభాలు ఆశించాలంటే పాడి పశువుల ఉత్పాదకత తప్పనిసరిగా పెరగాలని చెప్పారు. రైతు నేస్తం ఫౌండేషన్ రైతుల అభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు. వివిధ ప్రాంతాలకు చెందిన పాడి రైతులు తమ పాడి పశువులను వైద్య శిబిరానికి తీసుకొచ్చారు. ఆయా పశువులకు సంబంధించిన అనారోగ్యాలకు సంబంధించి నిపుణులైన పశు వైద్యులు పశువులను పరీక్ష చేసి అవసరమైన మందులు సలహాలను అందించారు. పాడి పశువులకు అవసరమైన ఆరోగ్యకరమైన పశుగ్రాసాల వివరాలు సమయానుకూలంగా పాడి పశువుల వయస్సు వాతావరణ మార్పులకు అనుగుణంగా పాడి పశువుల ఆరోగ్య రక్షణకు అవసరమైన టీకాల వివరాలను తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏడీ డాక్టర్ ఎం.శివరాశర్మా, జాయింట్ డెరెక్టర్ జేపీ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ జేడీ ఏ వెంకటేశ్వర్లు, లాం శాస్త్రవేత్త డాక్టర్ ముత్తారావు, రిటైర్డ్ జేడీ డాక్టర్ విజయకుమార్‌శర్మ, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ రాంబాబు, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ మాదవరావు, డాక్టర్ సుబ్రహ్మణ్యాచారి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ శివసాగర్‌రెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూ నగర్: ప్రజల నుండి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్లో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యల పై నేరుగా తమకు అర్జీలు ఇవ్వవచ్చని తెలిపారు.

బాధితులకు పరామర్శ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో వాంతులు, విరోచనాలతో చికిత్స పొందుతున్న బాధితులను బీజేపీ నేతలు పరామర్శించారు. బీజేపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ నగరంలో కలుషిత నీటి సమస్య గురించి తాము ముందే అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినప్పటికి అధికారులు పట్టించుకోవలేదని ఆరోపించారు. చనిపోయిన వారికి రూ.25లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, కుమార్‌గౌడ్, వెలగలేటి గంగాధర్, ప్రతాప్, ప్రసాద్, సురేష్, రమేష్ ఉన్నారు.

శ్రమలేని జీవన విధానమే కీళ్లవాతానికి మూలం

డాక్టర్ మురళీకృష్ణ



లక్ష్మీపురం: మన ఆరోగ్యం మనం తీసుకునే ఆహారం బట్టి ఉంటుందని ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ ఎం.మురళీకృష్ణ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆరోగ్య సభలో మాట్లాడారు. అనారోగ్య ఆహారపు అలవాట్లు వల్ల మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ లేపోవడం వల్ల ఈ రుమటాయిడ్ ఆర్థరైటిస్ వస్తుందన్నారు. అధునాతన వైద్యం ద్వారా రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు మంచిగా వైద్యం చేయవచ్చన్నారు. అనంతరం పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు.

టెన్నిస్ విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు ప్రధానం

నగరంపాలెం: స్థానిక జేకేసీ కళాశాల రోడ్‌లోని వి.వి.వి.హెల్త్ హబ్‌లో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సౌత్ ఇండియా– గుంటూరు జోనల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ప్రకాశం జిల్లాకు చెందిన భవానీదేవి(విన్నర్స్), క్రుషిద్ రన్నర్ టైటిల్‌ను సాధించారు. అనంతరం విజేతలకు వీవీవీ హెల్త్ హబ్ అధినేత టి.అరుణ్‌కుమార్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది సీహెచ్.రవీంద్రబాబు, ఎస్‌డి.రవికుమార్, జీవీఎస్‌ప్రసాద్, గంగాధర్, డీఈ కేవీఎల్ మూర్తి, సీనియర్ టెన్నిస్ క్రీడాకారులు, యోగా శిక్షకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో అందరికి సముచిత స్థానం

పార్టీ తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నూరిఫాతిమా తదితరులు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అంటే ఓ కుటుంబమని పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని 56వ డివిజన్ కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ ఆధ్వర్యంలో ఆదివారం నెహ్రూనగర్‌లో వైఎస్సార్ సీపీ ముఖ్యనేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అంటే రాష్ట్రంలో ప్రతి పేదవాడి పార్టీ అని తెలిపారు. తూర్పు నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పించే బాధ్యత తమదని హామీ ఇచ్చారు. తొలుత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అయిశెట్టి శ్రీనివాస్, నారకట్ల శ్రీనివాస్, కర్నుమా, యర్రబాబు, డొంగ్లీ, చిలక రమేష్, పల్లపు మహేష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తెలుగు జాతికి పట్టం – తెలుగోడికి పట్టాభిషేకం

పీవీకి భారతరత్న ప్రకటనపై సర్వత్రా హర్షం



పీవీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆచారి తదితరులు

పట్నంబజారు: రాజకీయ అపర చాణక్యుడు..రాజనీతి కోవిదుడు..సాత్వికుడు.. బహుభాషా పండితుడు.. అన్నిటినీ మించి పదహారణాల తెలుగువాడు మన పాములపర్తి వెంకటనరసింహారావు (పీవీ) అని ఆంధ్రకేసరి అభిమాన సంఘం నేత, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) కీర్తించారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. ఆదివారం ఆంధ్రకేసరి అభిమాన సంఘం ఆధ్వర్యంలో ప్రకాశంచౌక్ సెంటర్‌లో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్పొరేటర్ ఆచారి మాట్లాడుతూ ఒక మనిషిలో ఎన్ని గుణాలు, సుగుణాలు.. ఒక రాజకీయ వేత్తలో ఎన్నెన్ని కోణాలు ఉండాలో అన్నన్నీ సమపాళ్లలో ఉన్న విలక్షణమైన వ్యక్తిత్వం, విజ్ఞానంతో కూడిన తేజస్సు, విశిష్టమైన యశస్సు పీవీ సొంతమని కొనియాడారు. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి హోదాల్లో భారతదేశం ప్రయోజనాలు కాపాడడంలో పీవీ క్రియాశీలకంగా వ్యవహరించారన్నారు. పీవీ తీసుకున్న ఆర్థిక సంస్కరణ నిర్ణయాలు భారతావనికి దిక్సూచిగా మారాయన్నారు. ప్రతి తెలుగువాడు గర్వపడేలా ఆయన ప్రస్థానం సాగిందనీ.. అందుకే తెలుగు తల్లి ఒడిలో ఆయనకు సుస్థిర స్థానం లభించిందనీ, అలాంటి మహోన్నతుడైన తెలుగు తేజానికి దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్న అవార్డు వరించడం ఒక్క తెలుగు వారికే కాక యావత్తు భరత జాతికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బండా రవీంద్రనాథ్, బ్రాహ్మణ సేవా సమితి కార్యదర్శి బాలకృష్ణ, పొత్తూరి శ్యామ్, గీతామందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, మహేంద్ర గులేచా, పరశురామ బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధి కప్పగంతుల ఆదిలక్ష్మి, అన్నంరాజు సాయిరాం, అయితి సతీష్, ఆదిత్య రామకృష్ణ, డేవిడ్, నాగార్జున, విజయారెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు జీవితంలో అంతర్భాగం కావాలి

భాష్యం గుంటూరు అర్బన్ జోన్ స్పోర్ట్స్ మీట్‌లో డాక్టర్ రాకేష్‌బాబు



మాట్లాడుతున్న డాక్టర్ దేవాభక్తుని రాకేష్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: చిన్ననాటి నుంచే క్రీడలు మన జీవితంలో అంతర్భాగం కావడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని ప్రముఖ వైద్యులు దేవాభక్తుని రాకేష్ బాబు అన్నారు. గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్ మైదానంలో భాష్యం గుంటూరు అర్బన్ జోన్ స్పోర్ట్స్‌మీట్ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రాకేష్‌బాబు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. క్రమం తప్పకుండా స్పోర్ట్స్‌మీట్స్ నిర్వహిస్తూ, విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపుతున్న భాష్యం విద్యాసంస్థల కృషి అభినందించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించి, వారిని సామాజిక మాధ్యమాలకు వీలైనంత దూరంగా ఉంచాలని, నిరంతరం వారు చేస్తున్నారనే విషయాన్ని పర్యవేక్షించాలని సూచించారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే ఇంటి భోజనం కంటే మించినది మరొకటి లేదని, ఫాస్ట్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచించారు. తొలుత డాక్టర్ రాకేష్ బాబు స్పోర్ట్స్‌మీట్ జెండాను అవిష్కరించిన అనంతరం ఓపెన్ పరేడ్‌లో విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించి, శాంతికి చిహ్నమైన పావురాలను ఎగురవేశారు. ఈసందర్భంగా స్పోర్ట్స్‌మీట్‌లో నిర్వహించిన వివిధ రకాల క్రీడలు వీక్షకులను అలరించాయి. క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు భాష్యం చైర్మన్ రామకృష్ణ చేతుల బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాష్యం గుంటూరు అర్బన్ – 1 జెడ్ ఈవో శివ, అర్బన్ – 2 జెడ్ ఈఓ స్వప్న, భాష్యం ఐఐటీ ప్రోగ్రామర్ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

మానసిక సమస్యలు అభివృద్ధికి అవరోధాలు

డాక్టర్ నీలి ఉమాజ్యోతి



మాట్లాడుతున్న డాక్టర్ నీలి ఉమాజ్యోతి

గుంటూరు మెడికల్: ప్రస్తుత పరిస్థితులు అన్ని వయసుల వారిలో అనేక మానసిక సమస్యలకు, రుగ్మతలకు కారణమవుతున్నాయని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రి మానసిక వైద్య విభాగం అధిపతి డాక్టర్ నీలి ఉమా జ్యోతి అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ సమావేశ మందిరంలో ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా మానసిక వ్యాధులపై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. డాక్టర్ ఉమాజ్యోతి మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా అధిక మానసిక ఒత్తిడి, ఆందోళన ప్రతి ఒక్కరిలో పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా విధానం మొదలుకొని జీవన విధానం వరకు అన్ని అందుకు కారణం అవుతున్నాయని వివరించారు. మానసిక రుగ్మతస్థాయి పెరిగి వ్యక్తిగత జీవితానికి, బంధువులకు, ఇతరులకు ఇబ్బంది కలిగినప్పుడు మాత్రమే వైద్యులను సంప్రదిస్తున్నారని తెలిపారు. ఎవరిలోనైనా తొలి దశలోనే మానసిక రుగ్మతలను, సమస్యలను గుర్తించితే మందుల అవసరం లేకుండా జీవన శైలిలో మార్పులు, కౌన్సిలింగ్ ద్వారా నియంత్రించవచ్చన్నారు. అయితే అత్యధికులు ఆ స్థాయి దాటిన తర్వాతే వైద్యుని సంప్రదిస్తున్నారని, అప్పుడు మందులు అవసరం తప్పనిసరి అవుతోందని పేర్కొన్నారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ తాతా సేవకుమార్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి మాట్లాడారు. సమావేశంలో పాల్గొన్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి వి.సుబ్రహ్మణ్యం,సభ్యులు సిహెచ్ .శివాజీ, కే సత్యనారాయణ, జి.లింగారెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై ఇద్దరు చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. శ్రీనివాసరావు పేటలో ఆదివారం తెల్లవారుజామున సురేష్‌కుమార్ నడిచి వెళ్తుండగా ఇద్దరు యువకులు అడ్డుకున్నారు. సురేష్‌కుమార్‌ని సెల్‌ఫోన్ ఇవ్వమని బెదిరించారు. సురేష్‌కుమార్ అందుకు నిరాకరించాడు. ఇరువురు సురేష్‌కుమార్‌పై దాడి చేసి గాయపరిచారు. సురేష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరులపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: పేకాటాడుతున్న ఎనిమిది మందిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కుందుల రోడ్డులో పేకాటాడుతున్నరన్న సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరి నుంచి 52,800 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.